
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

సోమవారం 30 జూన్ 2025

జోరుగా ఇసుక

అక్రమ రవాణా

- ఇందిరమ్మ ఇళ్ల పనుల పేరిట దందా
- ట్రాక్టర్ ట్రిప్పుకు రూ. 4,500 నుంచి రూ.5 వేల వరకు వసూలు

8



కొమ్మ కొమ్మకో

కొంగ

చేర్యాలలోని గాంధీచౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో పలు జనావాసాల వెనుక ఖాళీ ప్రదేశంలోని పిచ్చిమొక్కలపై భారీసంఖ్యలో కొంగలు ఆవాసం ఏర్పరచుకున్నాయి. నాలాల ఆక్రమణ, కల్వర్టుల మూసి వేతతో కడవేరుగు దారిగుండా కుడి చెరువులోకి వరదనీరు మళ్లించే పరిస్థితి లేకపోవడంతో నిల్వ ఉన్న నీటిలో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిపై వందలాది కొంగలు చెట్లపై ఆవాసం ఏర్పరుచుకున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిలో విహరిస్తుండగా, మధ్యాహ్నం వేళ చెట్టు చిటారున కొమ్మకో కొంగ సేదతీరుతున్నాయి.

- చేర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

సిద్దిపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

సిద్దిపేట అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భజలాలు అడుగంటి, పంటలు ఎండిపోయి, వర్షాలు కురవక సిద్దిపేటలో కరువు విలయతాండవం చేస్తుందని, ప్రభుత్వం కరువు జిల్లాగా సిద్దిపేటను ప్రకటించి రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో రెండు నెలలుగా వర్షాలు కురవలేదని, పెట్టిన విత్తనాలు మొలకెత్తక పెట్టుబడులు కూడా అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రాజెక్టులు, కుంటలు, చెరువులు ఎండిపోయి సాగు, తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన చెందారు. అంచనా వేసి కరువు జిల్లాగా ప్రకటించాలని, కరువు నివారణ చర్యలు చేపట్టి నష్ట పరిహారం అందించాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలు అమలులో అనేక అవకతవకలు జరుగుతున్నాయని వాటిని పారదర్శకంగా అమలు చేసి నిరుపేదలకు చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, అమ్ముల బాలనర్సయ్య, బండికింది అరుణ్ కుమార్, తిప్పారపు శ్రీనివాస్, తాడూరి రవీందర్, అత్తిని శారద, జాలిగపు శిరీష, బద్దిపడిగ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్క రాములు

హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీని

ఫస్ట్ ఆప్షన్‌గా ఎంచుకోండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం నుంచి ప్రారంభమవుతున్న హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలను ఫస్ట్ ఆప్షన్‌గా ఎంచుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులను కోరుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ సంవత్సరం మొదటి సారి శాతవాహన యూనివర్సిటీకి సంబంధించి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయన్నారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ, ఏఐ కోర్సులతో ప్రతీ విభాగంలో 60 సీట్లకు మొత్తం 240 సీట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థులు, సమీప జిల్లాల విద్యార్థులు మీకు వచ్చిన ర్యాంకును బట్టి హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. ఈ కళాశాలలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంత్రి పొన్నంపై విమర్శలు చేస్తే

సహించేది లేదు

- కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని, ఇంకోసారి ఇలాగే మాట్లాడితే నీ వాహనాన్ని నియోజకవర్గంలో తిరగనివ్వబోమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిత్తారి రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందులు విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సతీష్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఒక రాష్ట్ర మంత్రిని వెదవ అని దూషిస్తారా.. అంటూ మండిపడ్డారు. నువు అభివృద్ధి చేయలేదు కాబట్టే పొన్నం ప్రభాకర్‌ను ప్రజలు గెలిపించుకున్నారనేది గుర్తుంచుకోవాలన్నారు. నీ హయాంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అభివృద్ధి పనులకు కాకుండా పంచాయతీలకు భవన్‌గా మార్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా హుస్నాబాద్‌ను సిద్దిపేటలో కుదువపెట్టావని, ఊరుకు దూరంగా పాలిటెక్నిక్ కాలేజీ నిర్మిస్తే విద్యార్థులు అరిగోస పడుతున్నారన్నారు. మీరంటే అందరికి గౌరవమని, అనవసరమైన ఆరోపణలు చేయకుండా అభివృద్ధి విషయంలో కలసిరావాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటి సత్యనారాయణ, డాక్టర్ అక్కు శ్రీనివాస్, చిత్తారి పద్మ, వివి రమణ, వల్లపు రాజు, మైదంశెట్టి వీరన్న, పూదరి శ్రీనివాస్, రాములు తదితరులున్నారు.

నిర్వహణ లేమితో

నిరాదరణ

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నకాశీ చిత్రకళ పురుడుపోసుకున్న చేర్యాలకు వన్నె తీసుకు రావడంతో పాటు పర్యాటకులను ఆకర్షింప చేసేందుకు రూ.లక్షలు వెచ్చించి పట్టణ శివారులో నిర్మించిన టూరిజం వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్ ప్రాభవం కోల్పోతుంది. పర్యాటకశాఖాధికారుల పట్టింపులేనితనం వలన నిర్వహణ కరువై నిరాదరణకు గురవుతుంది. రాష్ట్రానికి విచ్చేసిన అతిథులకైనా, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లే ముఖ్యులు, ప్రముఖులను కలిసి విన్నవించినా, ఆహ్వానించినా ప్రభుత్వ కానుకగా నకాశీ చిత్రకళలు బహూకరిస్తున్నప్పటికీ కళాకారులుగా తీర్చిదిద్దే వేదిక మాత్రం ఉనికి కోల్పోతుండటంతో ప్రజలు ఉసూరుమంటున్నారు.

- చేర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

- నకాశీ టూరిజం వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్‌పై నిర్లక్ష్యం
- రేకులషెడ్ తొలగించి సామాన్లు తీసుకెళ్లిన క్యాంటీన్ నిర్వాహకుడు
- రక్షణలేమి, ఖర్చుల భారంతో కళాకారుల నిరాసక్తత
- చేర్యాల వన్నెకు మాయని మచ్చ
- పర్యాటకశాఖాధికారులతీరుపై ప్రజల మండిపాటు

విదేశీయులు, అతిథుల చూపు చేర్యాల వైపు

అరుదైన వారసత్వ కళాసంపద అయిన చేర్యాల పేయింటింగ్స్‌కు దేశ, విదేశాల్లో ఎంతో క్రేజ్ ఉంది. మారుతున్న కాలానికిగనుగుణంగా పేయింటింగ్స్ కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో చూడగానే ఇట్టే ఫిదా అయిపోతారు. దేశ,విదేశాల్లో నకాశీ కళాకారులు ప్రదర్శనలు నిర్వహించి కళప్రాముఖ్యతను చాటిన క్రమంలో ఎంతో మంది ఆసక్తికనబరుస్తూ చేర్యాల వైపు అడుగులు వేస్తున్నారు.



బోసిపోతున్న వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్

విదేశీ పర్యాటలను ఆకర్షించడంతో పాటు కళను భావితరాలకు అందించాలని స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వర్క్‌షాప్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పనులను అర్ధాంతరంగా వదిలేశారు. సిద్దిపేట జిల్లాలో విలీనానంతరం జవసత్వాలు పొందింది. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయంతో పాటు నకాశీ కళ ఔన్నత్యం ఉట్టిపడేలా భవనం లోపల, బయట ఎన్నో బొమ్మలు గీయించి వర్క్‌షాపు గెస్ట్‌హౌజ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ వహించి నిరంతరం వర్క్‌షాప్ కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. నకాశీ పేయింటింగ్స్ తయారీ, క్రయ, విక్రయాలు, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచారు. కళాకారులకు నెలవారీ వేతనాలు, శిక్షణ పొందే వారికి స్టైఫండ్, రంగులు, ముడిసరుకులు ప్రభుత్వమే సమకూర్చాలని సూచించారు. ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులతో పాటు స్థానికులకు కళను ఉచితంగా శిక్షణ ఇప్పించేలా చొరవ తీసుకున్నారు. పర్యాటకులను ఆకర్షించే ప్యాకేజీలను తీసుకురావడం దారా దేశ,విదేశీయులు, ఆర్కిటెక్టులు, ట్రెయినీఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎక్కడెక్కడినుండో వచ్చి ప్రశంసలు అందించారు.



వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్‌ను సందర్శించి తన ఫోన్‌లో ఫొటో తీసుకుంటున్న బ్రిటీష్ హైకమిషనర్ (ఫైల్)



సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో అతిథులకు నకాశీ పేయింటింగ్ అందజేత (ఫైల్)

తిరోగమనం

రానురాను పర్యాటకశాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదారణ కోల్పోతుంది. వర్క్‌షాప్‌లో పాల్గొనే ఔత్సాహికులతో పాటు అతిథులు వచ్చిన సమీయంలో ఆతిథ్యమందించడం కోసం క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

మిగతా 8వ పేజీలో

జయహో జగన్నాథా..

- సిద్దిపేటలో వైభవంగా రథయాత్ర

7

అదిగదిగో.. తెలంగాణ పండరి

- 94వ ఆషాఢి ఉత్సవాలకు మర్కుక్ పాండురంగాశ్రమం ముస్తాబు
- జూలై 5 నుంచి మూడు రోజుల ఆధ్యాత్మిక సంబురం
- చాటలతో అన్నప్రసాద వితరణ ఇక్కడ ప్రత్యేకం
- భక్తుల సంఖ్యను భగవంతుడే నిర్ణయించే అద్భుతం

7

అసలే సింగిల్ రోడ్డు.. ఆపై భారీ వాహనాలు

- ప్రమాదకరంగా వర్గల్ - నాగిరెడ్డిపల్లి రోడ్డు
- దాదాపు 15 ఏళ్లుగా మరమ్మతులు కరువు
- దారి పొడవునా మూల మలుపులు, కల్వర్టులు
- సూచికబోర్డుల ఊసేలేదు

8

మల్లన్న ఆలయంలో

భక్తుల రద్దీ

చేర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆల య సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయపరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్ రెడ్డి, శ్రీరాములు పర్యవేక్షించారు.



శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాలు

బోనమెత్తిన సిద్దిపేట

ఆషాఢమాసం సందర్భంగా సిద్దిపేట బోనమెత్తింది. ఆదివారం పట్టణంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో అమ్మవార్లకు బోనం సమర్పించారు. బురుజు మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి బోనం సమర్పించారు. ఈసందర్భంగా మహిళలు వేంకటేశ్వరాలయం నుంచి బురుజు వరకు బోనాలతో పెద్దఎత్తు న తరలివచ్చారు. స్థానిక కౌన్సిలర్ దీప్తి నాగరాజు పలువురు కౌన్సిలర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు అమ్మవారిని దర్శించుకున్నారు. శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శంకర్‌నగర్ నుంచి కోమటి చెరువు నల్లపోచమ్మ ఆలయం వరకు బోనాలతో తరలి వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మైత్రివనం నుంచి హౌజింగ్ బోర్డు నల్లపోచమ్మ వద్దకు బోనమెత్తుకుని కదిలివచ్చారు

- సిద్దిపేట కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)





తొగుటలో జోరు వాన

తొగుట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పంటలు సాగుచేసిన రైతన్నలు వర్షాలు లేక కొద్దిరోజులుగా ఇబ్బందులు పడుతున్న సమయంలో నిన్న కురిసిన వర్షంతో ఊరట చెందారు. ఇప్పటికే సాగుచేసిన ఆరుతడి పంటలు మొక్కజొన్న, పత్తి పంటలు ఎండుముఖం పట్టాయి. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా వర్షాలు లేక నారుమళ్లు సైతం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. కాగా మండలంలో సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చకచకా సుందరీకరణ

- రూ.18 కోట్లతో వేగంగా ఎల్లమ్మ చెరువు పనులు
- బతుకమ్మ పండుగ వరకు పూర్తిచేయాలన్నదే లక్ష్యం..
- గ్లాస్ బ్రిడ్జి, రౌండు మెట్ల నిర్మాణం..

హుస్నాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో కాకతీయులు నిర్మించిన ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో వేగం పుంజుకుంది. బతుకమ్మ పండుగ వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఈ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.18 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టారు. జనవరి 5న రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 30 శాతానికి పైగా పనులు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కాకతీయుల కాలంలో నిర్మించిన ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దీనిని మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు రూ. 6.50 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు అనుకున్న మేర జరగలేదు. తదనంతరం టూరిజం శాఖ రూ. 2.50 కోట్లు మంజూరు చేయగా వాకింగ్ ట్రాక్, లైటింగ్, కట్ట ఆధునీకరణ పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారు.



కొనసాగుతున్న కట్ట కాంక్రీట్ పనులు



చెరువులో దిగేందుకు మెట్ల నిర్మాణానికి కొనసాగుతున్న పనులు

ప్రస్తుతం ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో పాటు పర్యాటక స్థలంగా మార్చేందుకు రూ. 18 కోట్లు కేటాయించారు. చెరువు బ్యూటీషియన్‌లో భాగంగా ఎంట్రీ అర్చి, చెరువు కట్టకు గ్రాస్, వ్యూ డెక్, మామెంటర్ అర్చ్, గ్లాస్ బ్రిడ్జి, ప్లే ఏరియా, అర్నమెంటల్ వర్క్స్ వంటి పనులతో పర్యాటకంగా తీర్చిదిద్దనున్నారు.

గ్లాస్ బ్రిడ్జి, రౌండ్ మెట్ల నిర్మాణ పనులు..

కట్టపై అందంగా గ్రీనరీ ఏర్పాటు చేసే పనులు, అలాగే మొదటి తూము వద్ద చెరువులో గ్లాస్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. వర్షాలు వచ్చి చెరువు నిండక ముందే ఈ పనులు చేయాలనే ఉద్దేశంతో పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. చెరువు కట్ట మైసమ్మ గుడి వద్ద చెరువులోకి దిగేందుకు అదనంగా అర్ధచంద్రాకారంలో మెట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్వాగత తోరణాన్ని హైదరాబాద్‌లో చేయిస్తున్నారు. ఈ పనులను సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

అండగా వెళ్లి.. హత్యకు గురై

భూతగాదాతో దాడి.. స్నేహితుడి బలి

ఒకరికి తీవ్ర గాయాలు..సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో దారుణం

కల్హేర్/సిర్గాపూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : దాయాదుల మధ్య భూ తగాదాలు, పాత కక్షలు తీవ్రరూపం దాల్చడంతో మారణాయుధాలతో దాడి చేసి దారుణ హత్యకు పాల్పడిన సంఘటన సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భూమి విషయంలో అండగా వచ్చిన స్నేహితుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖాజాపూర్ గ్రామానికి చెందిన కుర్మ హన్మండ్లు, కుర్మ రమేష్(34) దాయాదులు. వీరి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. రమేష్ తన భూమిలోకి వెళ్లాలంటే హన్మండ్లు భూమిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయంలో వారిమధ్య తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయి. అంతేకాకుండా, రమేష్ కుటుంబానికి చెందిన ఒక ఎకరం భూమిని కూడా దౌర్జన్యంగా హన్మండ్లు కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం కుర్మ రమేష్ తన స్నేహితుడు జైపాల్(35) తో కలిసి వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాడు. అప్పటికే హన్మండ్లు కుటుంబసభ్యులు తమ భూమి వద్ద ఉన్న రేకులషెడ్డులో ఉన్నారు. ఇరువురి మధ్య మళ్లీ ఘర్షణ మొదలైంది. పాతకక్షలతో రెచ్చిపోయిన హన్మండ్లు కుటుంబసభ్యులు మారణాయుధాలతో రమేష్, జైపాల్‌పై దాడికి దిగారు. ఈ దాడిలో జైపాల్ తల తెగి అక్కడికక్కడే మరణించాడు. దాడితో అపస్మారకస్థితిలో పడిపోయిన రమేష్‌ను చంపడానికి ప్రయత్నిస్తుండగా, అతని తల్లి, మరో వ్యక్తి అక్కడికి చేరుకుని కేకలు వేయడంతో హన్మండ్లు కుటుంబసభ్యులు సంఘటనా స్థలం నుంచి పారిపోయారు.


మృతుడు కార్నట్ల జైపాల్(ఫైల్), గాయపడిన రమేష్


సంఘటన స్థలంలో క్లూస్ టీం, పోలీసుల పరిశీలన

విషయం తెలుసుకున్న సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్ రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి వివరాలు సేకరించారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడు జైపాల్ తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కుర్మ హన్మండ్లు, అతని భార్య కవిత, కొడుకు పండరి, కోడలు వసుధ, తండ్రి సాయిగొండ, తల్లి కిష్టవ్వ, డాకుగొండ, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా భూ తగాదాలో కుర్మ రమేష్‌ను మట్టుబెట్టి, తమ భూముల పక్కనే ఉన్న మూడున్నర ఎకరాలను కబ్జా చేయాలనే పక్కా ప్రణాళికతోనే నిందితులు ఈ దాడికి పాల్పడినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుపాయలలో కారు బోల్తా.. బాలిక మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- కూతురు మృతికి కారణమైన వారిపై తండ్రి ఫిర్యాదు

పాపన్నపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ బాలిక మృతి చెందగా, పలువురికి గాయాలైన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. హైద్రాబాద్‌లోని బేగంపేటకు చెందిన కొత్తూరి ప్రతిమ(17) ఇంటర్ పూర్తి చేసింది. కొంతకాలంగా ఫతేనగర్ ప్రాంతానికి చెందిన గొల్ల చింటూ ప్రతిమను ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. ఈ విషయంలో చింటూను ప్రతిమ కుటుంబీకులు ఇదివరకే మందలించారు. అయినా తీరు మారలేదు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో వారికి చెప్పకుండా ప్రతిమ బయటకు వెళ్లింది. చింటూతో పాటు అతని స్నేహితులు మనోహర్, శివకుమార్ కలిసి శనివారం రాత్రి ఏడుపాయలకు ఇన్నోవా కారులో బయలుదేరారు. చింటూ కారు నడుపుతుండగా ప్రతిమతో పాటు ముందు కూర్చోగా, మిగిలిన వారు వెనక కూర్చున్నారు. రాత్రి సమయంలో ఏడుపాయలకు చేరుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆకలి వేస్తుందని భోజనం చేయడానికి పోతంశెట్టిపల్లి వైపు వెళ్తుండగా బస్టాండు సమీపంలోకి రాగానే కారు అతివేగంతో డివైడర్‌ను ఢీ కొట్టడంతో పల్టీలు కొట్టి బోల్తా పడింది. అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ప్రతిమ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. చింటూ, మనోహర్, శివకుమార్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఇంట్లో తెలియకుండా తన కూతురిని తీసుకువచ్చి ఆమె మృతికి కారణమైన చింటూపై చర్యలు తీసుకోవాలని ప్రతిమ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



ఏడుపాయల్లో బోల్తాబడ్డ కారును పరిశీలిస్తున్న పోలీసులు, ప్రతిమ మృతదేహం

ఇళ్లలో మోటార్లను అపహరిస్తున్న యువకుడు

దేహశుద్ధి చేసిన గ్రామస్థులు, పోలీసులకు అప్పగింత

శివ్వంపేట, జూన్ 29 ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో సంపు మోటార్లను తరచుగా దొంగిలిస్తున్న ఓ యువకుడికి మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామస్థులు ఆదివారం దేహశుద్ధి చేశారు. చావిడి దగ్గర జెండా స్తంభానికి కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మగ్దుంపూర్ గ్రామానికి చెందిన కనికని పరశురాం, అతని బావమరిది రామచంద్రం ఇళ్లలోని సంపులపై ఉన్న మోటార్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. వారికి అనుమానం వచ్చి గ్రామానికి చెందిన కాశబోయిన ప్రశాంత్ అనే యువకుడి ఇంటిలో వెతకగా రెండు మోటార్లు దొరికాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు ప్రశాంత్‌ను పట్టుకున్నారు. గతంలో కూడా ఓ వృద్ధురాలి మెడలో గుండ్లను చోరీ చేసిన ప్రశాంత్‌పై వారికి ఆగ్రహం ఉంది. దొరికిన ప్రశాంత్‌ను ఆదివారం ఉదయం మూడు గంటలకుపైగా చావిడి వద్ద జెండా స్తంభానికి తాడుతో కట్టి బంధించారు. చేతులతో, కర్రలతో చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. అపహరించిన రెండు మోటార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు కనికని వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. రెండు మోటార్లను స్వాధీనం ఎస్ఐ వెల్లడించారు.

నటుడు నీరుడి వీరేష్ కన్నుమూత

గబ్బర్‌సింగ్, రెబెల్ వంటి చిత్రాల్లో సైడ్ విలన్‌గా నటించిన వీరేష్

నర్సాపూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో సైడ్ విలన్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్‌కు చెందిన నీరుడి వీరేష్ (40) ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. దీంతో హన్మంతాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరేష్, సినీ రంగంలో సైడ్ విలన్ పాత్రలు చేస్తూ జీవనం సాగించేవారు. ముఖ్యంగా ఆయన గబ్బర్‌సింగ్, రెబెల్, చెన్నై ఎక్స్‌ప్రెస్(హిందీ), తడాఖా, అరవింద సమేత వంటి పలు చిత్రాలతో పాటు అనేక సీరియల్స్‌లో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్న వీరేష్, ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న హన్మంతాపూర్ గ్రామ ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.


గబ్బర్‌సింగ్ సినిమా షూటింగ్ సమయంలో పవన్‌కల్యాణ్‌తో నీరుడి వీరేష్(ఫైల్)

తోసేశాడా.. దూకేశారా?

- దంపతుల ఆత్మహత్యాయత్నం కేసులో కొత్త ట్విస్ట్
- భర్తే భార్యను, ఇద్దరు పిల్లల్ని కోర్టు భవనంపై నుంచి తోసేశాడని పోలీసులకు ఫిర్యాదు

రామాయంపేట/మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ కోర్టు భవనంపై నుంచి దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం మృతురాలి తల్లి మెదక్ పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కూతురు, పిల్లలను ఆమె భర్తే భవనంపై నుంచి తోసి, తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాలోని రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమ్యకు 2019లో దౌల్తాబాద్ వాసి నవీన్ గౌడ్‌తో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెళ్లైన కొన్నాళ్ల తర్వాత మద్యానికి బానిసైన నవీన్, భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం రమ్య పిల్లలతో సహా పుట్టిల్లు లక్ష్మాపూర్‌కు వెళ్లింది. అయినప్పటికీ నవీన్ తీరు మార్చుకోలేదు. లక్ష్మాపూర్‌కు వచ్చి పలుమార్లు భార్యను తనతో రావాలని గొడవపడ్డాడు. రమ్య వెళ్లనందున ఏడాది క్రితం లక్ష్మాపూర్‌లో ఇంటిపై టపాసులు వేసి భయభ్రాంతులకు గురిచేశాడు. అప్పట్లో రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదై, నెల రోజులు జైలు జీవితం కూడా గడిపాడు. ఆరు నెలల క్రితం పలువురు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి, ఇక తాను మారుతానని నమ్మించి నవీన్, భార్యను దౌల్తాబాద్‌లోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే లోక్ అదాలత్‌లో కేసుల ఉపసంహరణకు రాజీ కుదుర్చుకున్నారు. కానీ అతనిలో మార్పు రాలేదు. తాగుడుకు బానిసై, భార్యను అలాగే వేధించడం కొనసాగించాడు. శనివారం నవీన్ మొదట రామాయంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, గత కేసు సమయంలో సీజ్ చేసిన తన బైక్, మొబైల్ తిరిగి ఇవ్వాలని కోరాడు. కోర్టు నుంచి తెచ్చుకోవాలని పోలీసులు తెలపారు. సాయంత్రం కోర్టు వేళలు ముగిసే సమయానికి నవీన్, రమ్య, పిల్లలను వెంట తీసుకుని కోర్టుకు వచ్చారు. అప్పటికే కోర్టు పని వేళలు ముగిసిపోయాయని సిబ్బంది తెలపడంతో అక్కడే కాసేపు వారి మధ్య వాగ్వావాదం జరిగింది. వారంతా అలాగే వాదులాడుకుంటూ కోర్టు భవనంపైకి చేరుకున్నారు. ఇద్దరి మధ్య గొడవ ముదిరి, స్థిమితం కోల్పోయిన నవీన్ రమ్యను, పెద్ద కుమార్తెను మొదట కిందకు తోసేశాడని రమ్య తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత చిన్న కుమార్తెనూ భవనం పైనుంచి విసిరేసి, ఆపై ఎలాగూ తనను జైల్లో పెడతారని భావించి, క్షణికావేశంలో నవీన్ కూడా దూకేసి ఉంటాడని వారి బంధువులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో రమ్య అక్కడికక్కడే చనిపోయింది. నవీన్, ఇద్దరు పిల్లలు చికిత్స పొందుతున్నారు. వీరు కోలుకుంటే కేసు పురోగతి ఉంటుందని భావిస్తున్నారు. లక్ష్మాపూర్‌లో ఆదివారం సాయంత్రం రమ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి.


చిన్న కూతురు రిత్వికతో రమ్య (ఫైల్)

నిత్య జీవితంలో స్వదేశీ వస్తువులను వాడాలి

స్వదేశీ జాగరణ్‌మంచ్ ఆల్‌ఇండియా కో కన్వీనర్ అజయ్ పాఠక్

మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ వస్తువుల వినియోగం ద్వారా మన సంపద విదేశాలకు తరలిపోకుండా నిరోధించవచ్చని, తద్వారా దేశ ఆర్థిక శక్తి మరింతగా వృద్ధి చెందుతుందని స్వదేశీ జాగరణ్ మంచ్ ఆల్ ఇండియా కో కన్వీనర్ అజయ్ పాఠక్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ డెంటల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పురాతన వైద్యశాస్త్రంలో అగ్రగామిగా నిలుస్తున్న ఆయుర్వేదం, పంచకర్మ వంటి చికిత్సల ద్వారా థైరాయిడ్, పీసీవోడీ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్), హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు) వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులోకి తీసుకురావచ్చని ఆయన వివరించారు. ముఖ్యంగా పంచకర్మ ద్వారా చిన్నపిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని శాస్త్రీయంగా రుజువైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డెంటల్ డాక్టర్ చంద్రమౌళి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మమత, మంచ్ సంఘటనా కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, డా.నారాయణగుప్తా, విజయ్‌కుమార్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ పాఠక్


పాత ఎంబజీ కాలనీలో జగన్నాథ రథయాత్ర

జయహో జగన్నాథా..

సిద్దిపేట, భారతీనగర్‌లో వైభవంగా రథయాత్ర


సిద్దిపేటలో రథంపై కొలువుదీరిన దేవుళ్లు

సిద్దిపేట కల్చరల్/రామచంద్రాపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథ రథ చక్రాలు కదిలాయి. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా పరిధిలోని భారతీనగర్ డివిజన్ పాత ఎంఐజీ కాలనీలో ఆదివారం జగన్నాథస్వామి రథయాత్రను అంగరంగవైభవంగా నిర్వహించారు. సిద్దిపేట హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి జగన్నాథుడి రథం లాగుతూ జయజయ ధ్వానాలు చేస్తూ భక్తిపారవశ్యంలో తేలిపోయారు. శ్రీకృష్ణ భగవానుడి లీలామృత కీర్తనలు, ఆట పాటలతో యాత్ర కోలాహలంగా సాగింది. పట్టణంలోని వెంకటేశ్వరాలయం నుంచి మొదలైన యాత్ర గాంధీచౌక్ మీదుగా మార్కెట్ హన్మాండ్ల నుంచి సుభాష్ రోడ్డు, మోడ్రన్ బస్టాండ్, విక్టరీ చౌరస్తా నుంచి వెంకటేశ్వరాలయానికి రథయాత్ర చేరుకుంది. యాత్ర అనంతరం ఆలయంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సంకీర్తనం, ప్రవచనం, 108 రకాల బోగ నివేదన, మహాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భోజన మహా ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. భారతీనగర్ డివిజన్ పరిధి పాత ఎంఐజీలో కార్పోరేటర్ సింధూఆదర్శరెడ్డి రథయాత్రను ప్రారంభించారు. ఆదివారం కావడంతో ఉద్యోగులు, యువతులు, చిన్నాపెద్ద భక్తులు పెద్దఎత్తున హాజరై రథాన్ని లాగారు. పురవీధుల గుండా ఊరేగింపు కొనసాగింది.


సిద్దిపేటలో జగన్నాథ రథయాత్ర




రథాన్ని లాగుతున్న మహిళలు

క్రైం కార్నర్

భవనంపై నుంచి జారిపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి

శివ్వంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శివ్వంపేట మండలంలోని శభాష్‌పల్లిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నార్సింగి గ్రామానికి చెందిన కండ్లకోయ ఆనంద్(21) శనివారం శభాష్‌పల్లిలో భవన నిర్మాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు భవనంపైనుంచి జారి పడిపోయాడు. తోటి కార్మికులు, స్థానికలు ఆనంద్‌ను వెంటనే తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతిని తండ్రి సిద్ధిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఝరాసంగం, జూన్29 (ఆంధ్రజ్యోతి) : పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన ఘటన మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుట్టుచప్పుడు కాకుండా తుమ్మన్‌పల్లి శివారులో పేకాట స్థావరాన్ని కొనసాగిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.19 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నాగులపల్లిలో బైక్ చోరీ

తూప్రాన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం నాగులపల్లిలో ఆదివారం తెల్లవారుజామున బైక్ చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే.. నాగులపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొండ సిద్ధిరాములు యాదవ్ శనివారం రాత్రి ఇంటి ఎదుట ఫ్యాషన్ ప్రో బైక్ (టీఎస్ 13 ఈపీ 1673)ను పార్కు చేశాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు బైక్‌ను చోరీ చేశారు. చుట్టుపక్కల గాలింపు చేసినప్పటికీ లభించలేదు. బైక్ చోరీపై తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిద్ధిరాములు వివరించారు.

యువతి అదృశ్యం



సంగీత

రామాయంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మైలారం సంగీత(21) శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరక లభించలేదు. యువతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజ్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్


సీజ్ చేసిన లారీ

కొండాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న వాహనాలను కొండాపూర్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మండలంలోని హరిదాస్‌పూర్ నుంచి మట్టిని తరలిస్తున్నారని పక్క సమాచారంతో శనివారం రాత్రి వాహనాలను పట్టుకుని కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాలుగు టిప్పర్లు, ఒక్క ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి పోలీసులకు అపగించినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు.


సహజ సిద్దంగా రాళ్ల మధ్య ఏర్పడిన గుహ


డిటోనేటర్‌తో రెండుగా చీల్చిన అపురూపమైన భారీ శిల

జీవవైమిథ్యం

శిలల విధ్వంసం.. కనుమరుగవుతున్న అద్భుత ఆనవాళ్లు

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా రాళ్ల వ్యాపారం

అధికారుల నిర్లక్ష్యంపై పర్యావరణవేత్తల ఆవేదన

అమీన్‌పూర్ బయోడైవర్సిటీ ప్రాంతంపై రియల్ మాఫియా పంజా

అమీన్‌పూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగర శివారు, పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పెద్దచెరువు, దాని పరిసర ప్రాంతాలు జీవవైవిధ్య (బయోడైవర్సిటీ) ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించబడినప్పటికీ, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మాఫియా చేతిలో తీవ్ర విధ్వంసానికి గురవుతున్నాయి. సుమారు వంద ఎకరాలలో విస్తరించిన పెద్దచెరువు, దాని చుట్టూ ఉన్న గుట్టలు, అద్భుతమైన భారీ శిలాజాలను సైతం జీవవైవిధ్య ప్రాంతాలుగా నోటిఫై చేస్తూ గతంలో సంగారెడ్డి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో జీవవైవిధ్యం అంతా మిథ్యగా మారిందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురాతన శిలలు కనుమరుగు

చెరువు కట్టను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 343లోని ప్రభుత్వ భూముల్లో విస్తరించి ఉన్న గుట్ట రాళ్లను రియల్ మాఫియా బద్దలు కొడుతోంది. పర్యావరణవేత్తల ప్రకారం, ఈ రాళ్లు సుమారు 2.5 బిలియన్ సంవత్సరాల పూర్వంనాటి (డైనోసార్ల యుగం నాటివి) శిలలని పురాతత్వ నిపుణులు తెలుపుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో, అపురూపమైన భారీ గుండ్రని రాళ్లను డిటోనేటర్లతో పేల్చి, ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. వీటి మధ్య ఏర్పడిన గుహలు సైతం ధ్వంసమవుతున్నాయి. ఇది కేవలం భూ ఆక్రమణ మాత్రమే కాకుండా, కోట్లాది సంవత్సరాల చరిత్ర కలిగిన సహజసిద్ధమైన వారసత్వాన్ని నాశనం చేయడమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన

నెల రోజులుగా ప్రభుత్వ సర్వే నంబర్‌లోని భారీ రాళ్లను రియల్ మాఫియా కనుసన్నల్లో బద్దలు కొడుతున్నారు. భారీ డిటోనేటర్లను ఉపయోగించి పేల్చివేసి, అరుదైన శిలలను కనుమరుగు చేస్తూ భూమిని చదును చేస్తున్నారు. గతంలో అమీన్‌పూర్ తహసీల్దార్ వెళ్లి పనులను అడ్డుకున్నప్పటికీ, ప్రస్తుతం పనులు యథాతథంగా కొనసాగడంపై చుట్టుపక్కల కాలనీల ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యంలో కీలకపాత్ర వహించే బృహత్ శిలలను కాపాడటంలో ఆర్కియాలజికల్ విభాగం సైతం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే సంగారెడ్డి కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, జీవవైవిధ్య రాళ్లను, చెరువును పరిరక్షించాలని ప్రజలు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగితే అమీన్‌పూర్ జీవవైవిధ్యం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

చెదిరిపోయిన వలస పక్షుల విడిది కేంద్రం

ఒకప్పుడు అమీన్‌పూర్ చెరువు చుట్టూ విస్తరించిన ఎత్తైన గుట్టలు, పంటపొలాలు, చెరువుకు రక్షణ వలయంగా ఉండేవి. ప్రతి సంవత్సరం వేల మైళ్ల దూరం నుంచి విదేశీ వలస పక్షులు ఈ గుట్టల్లోని రాళ్ల మధ్య గుడ్లను పొదిగేవి. అయితే, 343 సర్వే నంబర్‌లో ఉన్న భారీ రాళ్లు క్రమంగా కనుమరుగవడం, పచ్చదనం ఉన్న చోట కాంక్రీట్ భవనాల నిర్మాణం కావడంతో పక్షులకు ఆవాసం లేకుండా పోయింది. ఒకవైపు అమీన్‌పూర్ పెద్దచెరువు మురుగు నీటితో నిండుతుండగా, మరోవైపు గుడ్లను పొదిగేందుకు కావాల్సిన ప్రాంతం విధ్వంసమవడంతో వలస పక్షుల రాక క్రమంగా తగ్గిపోయిందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు పేర్కొంటున్నారు.


పెద్దచెరువులో వలస పక్షులు (ఫైల్)

ఘనంగా ఆషాఢమాస ఉత్సవాలు

- కూచన్‌పల్లిలో గోరింటాకు వేడుకలు
- బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు


వేడుకలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా బ్రాహ్మణసంఘ నేతలు


గోరింటాకు పెట్టుకుంటున్న దృశ్యం

మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా మహిళల గోరింటాకు వేడుకలు మెదక్ జిల్లాలో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హవేళీఘనపూర్ మండలం కూచన్‌పల్లిలోని కూచాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందంగా అలంకరించిన వేదిక వద్ద గోరింటాకు పెట్టుకునేందుకు స్నేహితురాళ్లతో కలిసి సందడి చేశారు. సాయంత్రం జరిగిన సభలో సంఘ నాయకులు, ముఖ్య అతిథులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ మాట్లాడుతూ ఆషాఢమాసం భక్తి, ప్రపత్తులకు ప్రతీక అని అభివర్ణించారు. గోరింటాకు వేడుకల ద్వారా మన సంప్రదాయాలను పునరుజ్జీవింపజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మధ్యాహ్న సమయంలో సామూహిక విందు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలను మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రామేశ్వర్‌రావు, జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సలాక రాజన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకరశర్మ, వైద్య శ్రీనివాస్, సలాక రాజేశ్వర్, గిరిధర్ దేశ్‌పాండే, ఉమాశంకర్, ఎస్.రాధాకృష్ణ, అదితిశర్మ, శ్యామ్, శ్రీనాథ్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అదిగదిగో.. తెలంగాణ పండరి

94వ ఆషాఢి ఉత్సవాలకు మర్కుక్ పాండురంగాశ్రమం ముస్తాబు

జూలై 5 నుంచి మూడు రోజుల ఆధ్యాత్మిక సంబురం

చాటలతో అన్నప్రసాద వితరణ ఇక్కడ ప్రత్యేకం

భక్తుల సంఖ్యను భగవంతుడే నిర్ణయించే అద్భుతం

మర్కుక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని భావానందపురంలోని పాండురంగాశ్రమంలో 94వ ఆషాఢి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. భక్తులు పులకించిపోయే త్రిరాత్రోత్సవాలు ఈ జూలై 5 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. పచ్చని ప్రకృతి వనాలు, పక్షుల కిలకిల రావాలు, అడుగడుగునా అపర భక్తుల విగ్రహాలతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి ఉంటుంది. తెలంగాణ పండరిగా పేరుగాంచిన ఈ ఆశ్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

మూడు రోజుల ఆధ్యాత్మిక వైభవం

ఆషాఢి ఉత్సవాలు మూడు రోజులపాటు అఖండ నామస్మరణతో మార్మోగనున్నాయి. తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుక్మిణి పాండురంగ స్వామికి క్షీరాభిషేకంతో భక్తోత్సవం ప్రారంభమవుతుంది. రెండో రోజు ఏకాదశి ఉపవాసాలు, జాగరణలతో ఆశ్రమ ప్రాంగణమంతా కిక్కిరిసిపోనుంది. ఇక మూడో రోజు ద్వాదశి మహా అన్నపూజతో వేలాది మంది భక్తులకు అన్నదానం చేసి జాతరను పరిసమాప్తం చేస్తారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి నల్గొండ, వరంగల్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు.



9 దశాబ్దాల చరిత్ర

సుమారు 9 దశాబ్దాల క్రితం, భవానంద భారతి స్వామివారు మహారాష్ట్రలోని పండరీపూర్ నుంచి పాదయాత్రగా రుక్మిణి పాండురంగ విగ్రహాలను ఇక్కడికి తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్యకల్యాణం, పచ్చతోరణం అన్నట్లు భగవంతుడికి పూజలు, భక్తులకు అన్నదానం నిరంతరాయంగా సాగుతున్నది. మరో ఆరేళ్లలో ఈ ఆషాఢి ఉత్సవాలు శతవసంతాలను పూర్తి చేసుకోనున్నాయి.

ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఏకాదశి ఉదయం నుంచి ద్వాదశి ఉదయం వరకు సాధ మంటపంలో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రముఖులతో హరికథా గానాలు, నామ సంకీర్తనలు, చక్రీ భజనలు, కోలాటాలు, పేరిణి నృత్యాలను నిర్వహించనున్నారు. స్వామివారి శిష్యులైన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వనున్నారు.



ఈసారి ప్రత్యేకత మహాసాద మంటపం

తొమ్మిది దశాబ్దాలుగా ఆషాఢి ఉత్సవాల సమయంలో ఆలయం ఎదురుగా ఉన్న తోటలోనే ద్వాదశి అన్నదానం జరిగేది. అయితే, ఈసారి భక్తుల సహకారంతో నిర్మించిన మహాస్సాద మంటపం అందుబాటులోకి వచ్చింది. అన్నదాన కార్యక్రమం ఈ విశాలమైన మంటపంలోనే జరగనుంది.

భక్తుల రాక భగవంతుడికే ఎరుక!

ఈ ఆశ్రమంలో జరిగే అన్నదానం ఒక అద్భుతం. ప్రతీ సంవత్సరం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఎంతమంది వచ్చినా, వండిన అన్నప్రసాదం ఒక మెతుకు కూడా తక్కువ కాకుండా, కచ్చితంగా అందరికీ సరిపోతుంది. ఇది ఎలా జరుగుతుందని అందరూ ఆశ్చర్యపోతుంటారు. ఇక్కడ ఆశ్రమ నిర్వాహకులు ప్రతీసారి ఎన్ని క్వింటాళ్ల అన్నం వండాలో సాక్షాత్తు పాండురంగ స్వామిని అడగడం విశేషం. చీటీలు రాసి స్వామి ముందు పెడతారు. అందులో ఒకటి తీసి, అందులో వచ్చిన సంఖ్య ప్రకారం అన్నం వండుతారు. అది వచ్చిన భక్తులందరికీ సరిగ్గా సరిపోతుంది. భక్తులు ఎంతమంది వస్తారో భగవంతుడే నిర్ణయించే అద్భుతమైన ఉత్సవం ఇది. మరో ప్రత్యేకత ఏమిటంటే, అన్నాన్ని రాశిగా పోసి పూజచేసి, ఆ తర్వాత చాటల ద్వారా వడ్డించడం. ద్వాదశి రోజు నిర్వహించే సామూహిక భోజనంలో ఒక్క ముద్దైనా తినాలని, ఒక్క చాటతోనైనా వడ్డన చేయాలని కులమత, పేదధనిక తేడా లేకుండా భక్తులంతా పోటీ పడుతుంటారు.

పాండురంగాశ్రమ ఉత్సవాల షెడ్యూల్

త్రిరాత్రోత్సవాలకు ముందే ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. జూలై 1న భగవన్నామ శోభాయాత్ర, 2న యతివర భావానంద భారతీస్వామి పాదుకాపూజ, 3న సీతారామచంద్రస్వామికి క్షీరాభిషేకం-పుష్పార్చన, 4న భవానీశంకరులకు ప్రత్యేక పూజలు, 5న త్రిరాత్రోత్సవాలు ప్రారంభం, 6న తొలి ఏకాదశి విశేష పూజలు, 7న ద్వాదశి మహాఅన్న పూజ - అన్నప్రసాద వితరణ


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

న్యూస్ బాక్స్

పవనసుత భజనమండలి నూతన కార్యవర్గం ఎన్నిక

చేర్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణ పవనసుత భజనమండలి నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా కల్వకోట రవీందర్‌రావు, అధ్యక్షుడిగా పెద్ది రమేశ్, కార్యదర్శిగా ఉప్పల నాగరాజు, కోశాధికారిగా చిగుళ్లపల్లి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా యాంసాని కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శిగా దిడిగం నర్సింహులు ఎన్నికయ్యారు.

బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా శంకర్

సిద్దిపేట రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన బండారు శంకర్ నియామకమయ్యారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలగందుల వెంకటేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా..

గజ్వేల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణానికి చెందిన మెకానిక్ భిక్షపతి రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ బైక్ మెకానిక్ సంఘం భిక్షపతి పరామర్శించి మెకానిక్ సంఘం తరఫున రూ.22 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడిసిన వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వీరన్నగారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

● **గజ్వేల్ రూరల్:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాల్యమిత్రుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన తలారి కరుణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సెస్సీ 2008-09 బ్యాచ్‌కు చెందిన అతడి చిన్ననాటి మిత్రులందరు కలిసి కరుణాకర్ కూతురు హన్సిక పేరు మీద రూ. 56 వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్‌ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కాటం శ్రీనివాస్ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయాలపాలయ్యాడు. చేర్యాల మాజీ వార్డుసభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు పచ్చిమడ్ల సిద్ధిరాములు ఆదివారం పరామర్శించి ఆర్థికసహాయం అందించి ఉదారతను చాటుకున్నాడు.

ఆలయ నిర్మాణానికి సహకారం

కోహెడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం పూర్తయ్యేంత వరకు నా సహాయ సహకారాలు అన్ని విధాలుగా ఉంటాయని అయ్యప్ప స్వాములకు కేరళ గురుస్వామి ఆచార్య కే ఎస్ ఉన్ని కృష్ణన్ నంబుతిరి హామీ ఇచ్చారు. ఆదివారం అయ్యప్ప స్వామి నూతన ఆలయంలో శాశ్వత సభ్యులు గుడి నిర్మాణం, వాస్తు, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాల గురించి కేరళ గురుస్వామి ఆచార్య ఉన్ని కృష్ణ నంబుతిరితో చర్చించారు. అనంతరం ఆలయ నిర్మాణ శాశ్వత బాధ్యతలు ఉన్ని కృష్ణన్‌కు ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి అప్పగించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా సమితి సభ్యులతోపాటు ఆయన ప్రతిజ్ఞ చేశారు.

అసలే సింగిల్ రోడ్డు.. ఆపై భారీ వాహనాలు

- ప్రమాదకరంగా వర్గల్- నాగిరెడ్డిపల్లి రోడ్డు
- దాదాపు 15 ఏళ్లుగా మరమ్మతులు కరువు
- దారి పొడవునా మూల మలుపులు, కల్వర్టులు
- రహదారిపై కనిపించని సూచికబోర్డులు
- ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు




వర్గల్- నాగిరెడ్డిపల్లి వెళ్లే సింగిల్ రోడ్డు, మూలమలుపు వద్ద ఏర్పాటు చేయని సూచికబోర్డు

వర్గల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల కేంద్రం నుంచి నాగిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం ఈ దారిపై వందలాది మంది ప్రజలు, వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీజీఐఐసీ పరిశ్రమలకు వెళ్లే దారి ఇదే. సింగిల్ రోడ్డుగా ఉండటంతో ప్రజలు, వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పరిశ్రమల కార్మికులు, భారీ వాహనాలతో రద్దీ

ప్రస్తుతం ఈ రోడ్డు గుండా నిత్యం అనేక మంది ప్రయాణం చేస్తుంటారు. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. టీజీఐఐసీ పరిశ్రమలు ఇదే దారిలో ఉండటంతో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, అధికారులు, వాహనాలు ఇదే దారి గుండా ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం పరిశ్రమలకు వచ్చే లారీలు, పెద్ద పెద్ద ట్రక్కులతో రోడ్డంతా బీజీ బీజీగా ఉంటుంది. రహదారిపై రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. వీటితో పాటు లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి వెళ్లే వారు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

సింగిల్ రోడ్డు.. మూలమలుపులు

దారి పొడవునా సుమారు 40 నుంచి 50 కల్వార్టులు, మూలమలుపులు ఉంటాయి. మూల మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేవు. అకస్మాత్తుగా ఎదురు వైపు నుంచి వాహనం వస్తే ప్రమాదం జరిగే దుస్థితి నెలకొన్నది. ఉన్న సింగిల్ రోడ్డు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వాహనం వస్తే రోడ్డు చిన్నదిగా ఉండటంతో కిందకు దిగలేని పరిస్థితి. రోడ్డుపై భారీ వాహనాలు నడవడంతో రోడ్డంతా అక్కడక్కడా గుంతలమయంగా మారింది. సంబంధిత శాఖ అధికారుల స్పందించి సింగిల్ రోడ్డుగా ఉన్న వర్గల్ నుంచి నాగిరెడ్డిపల్లి రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని, మూలమలుపులను, కల్వర్టులను సరిచేసి, వాటి వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని బీటీ రోడ్డు

వర్గల్ మండల కేంద్రం నుంచి ములుగు మండలం నాగిరెడ్డిపల్లి వెళ్లే రహదారి సుమారు 4 కిలో మీటర్ల వరకు ఉంటుంది. దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ రహదారిని సింగిల్ బీటీ రోడ్డుగా చేశారు. నాటి నుంచి ఈ రహదారిపై ప్రభుత్వం ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. ప్రభుత్వాలు మారాయి. అధికారులు మారారు. రోడ్డు పరిస్థితి మాత్రం మరింత అధ్వానంగా తయారైంది.

హుస్నాబాద్‌లో మైదాకు పండుగ



మైదాకును రోట్లో వేసి దంచుతున్న మహిళలు

హుస్నాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని స్వర్ణకారుల సంఘం భవనంలో ఆదివారం మహిళలు మైదాకు పండుగ నిర్వహించారు. మహిళలంతా ఒక చోట చేరి మైదాకును రోట్లో వేసి మెత్తగా దంచి చేతులకు, కాళ్లకు పెట్టుకున్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకును పెట్టుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ఇందులో ఎన్నో ఔషధ గుణాలున్నాయని పెద్దలు, మహిళలు చెబుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



లబ్ధిదారులకు లైసెన్స్‌లను అందజేస్తున్న మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ సత్తయ్య

గజ్వేల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని సిద్దిపేట జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ అక్కారం సత్తయ్య అన్నారు. ఆదివారం గజ్వేల్ నియోజకవర్గం మత్స్యకారుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో 112, లక్ష్మాపూర్ గ్రామంలో 74 మంది లబ్ధిదారులకు లైసెన్సులను అందజేశారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

చేర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేర్యాల మండల ప్రతినిధులు ఎండీ. జహీరుద్దీన్, అంబటి అంజయ్య అన్నారు. ఆదివారం చేర్యాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించి 250గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఆర్థికసహాయం, సంక్షేమపథకాలలో 10శాతం ఉద్యమకారులకు రిజర్వేషన్ కేటాయించాలని, రూ.25వేలు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి నేడు స్థానిక అంగడిబజారు వద్ద శాంతియుత దీక్ష చేపట్టనున్నామని తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు సన్మానం



స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లను సన్మానిస్తున్న మనోచేతన ఫౌండర్ వెంకటేశ్వర్లు

చేర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మనోచేతన టీచర్ ట్రైనింగ్ స్పెషల్ నీడ్స్ కళాశాలలో శిక్షణ పొంది డీఎస్సీ-2024లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు పొందిన 18మందిని ఆదివారం మనోచేతన నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫౌండర్ చుక్క వెంకటేశ్వర్లు వారిని శాలువా కప్పి నకాశీ పేయింటింగ్ మెమొంటో అందించి సత్కరించారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమం అట్టడుగు వర్గాలకు కేంద్రబిందువు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమం అట్టడుగు వర్గాలకు కేంద్రబిందువు అని ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉబ్బని ఆంజనేయులు పేర్కొన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మాదిగ యువకులతో సమావేశం నిర్వహించి ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల ప్రయోజనాల వరకే పరిమితం కాకుండా అన్ని అణగారిన కులాల సంక్షేమం కోసం కృషి చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయం సాధించిన నేపథ్యంలో జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అన్ని గ్రామాల్లో అన్ని కులాల సమక్షంలో పెద్ద ఎత్తున జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముంద్రాతి కృష్ణ, ముంద్రాతి రవి, కోడిశెల గిరిబాబు, కోడిశాల బాలు, తిప్పరామ్ కనకయ్య, గజ్వేల్ గణేష్, ప్రశాంత్, నరేష్, కార్తీక్ పాల్గొన్నారు.

జాలపల్లిలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

మద్దూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ దంపతులు చొప్పరి వరలక్ష్మీసాగర్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు గ్రామస్థులతో కల్సి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీసాగర్ మాట్లాడుతూ.. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం త్వరలోనే ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంప్రసాద్, గిరి కరుణతిరుపతి, బేర గంగాధర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఉన్నారు.

అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు



గజ్వేల్ మండలం బెజుగామలో భూమి పూజ చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్/కుకునూరుపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు అందిస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుతో పాటు మండల పరిధిలోని బెజుగామ, శేరిపల్లి, కొల్గూరు, దాచారం, అక్కారం, పిడిచెడ్, అహ్మదీపూర్, అనంతరావుపల్లి, బూర్గుపల్లి గ్రామాలు, కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ. ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సహాయం అందజేస్తున్నామని తెలిపారు. వెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయకులు శివరాంరెడ్డి, సమీర్, మోహన్నగారి రాజు, రాములు, శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార దాహంతో ఫోన్ ట్యాపింగ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 29: ఫోన్ ట్యాపింగ్‌లో కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మాటలు నమ్మిన ప్రజలు రెండుసార్లు అధికారాన్ని కట్టబెట్టినా ఆయన కుటుంబ సంక్షేమం కోసం తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. నీళ్ల పేరిట కాళేశ్వరంలో లక్షల కోట్లు దోచుకొని దాచుకున్నారని, ఉద్యోగాల కోసం పేపర్ లీకేజీల ద్వారా అమ్ముకున్నారని, నిధులు మాత్రం ఆ కుటుంబానికే దక్కాయని ఆరోపించారు. పదేళ్లలో ప్రతిపక్ష నాయకుడు లేకుండా ఉండాలని, అధికారం కోసం అడ్డమైన పనులు చేస్తూ ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడ్డారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, అర్షద్, ఎన్ఎస్‌యుఐ నాయకులు బబ్బు, శ్రీకాంత్, శేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను అడ్డం పెట్టుకొని గొడవలకు దిగొద్దు

కొమురవెల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసాన్‌పల్లి గ్రామాన్ని ఆదివారం కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ సందర్శించారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు వస్తూ...పోతుంటాయనీ వాటిని అడ్డం పెట్టుకొని గ్రామంలో గొడవలకు దిగవద్దన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను గ్రామంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలని సూచించారు. పిల్లలను మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా తల్లితండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం కలిగి ఉండాలి

మద్దూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సామాజిక సమానత్వం కలిగి ఉండాలని అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గడిపె ప్రభాకర్ సూచించారు. ఆదివారం మండలంలోని సలాఖ్‌పూర్‌లో సామాజిక సమానత్వ వారోత్సవాలను పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. సమాజంలోని అన్ని రకాల వ్యక్తులు సమాన హక్కులు, స్వేచ్ఛతో పాటు హోదాను కలిగి ఉండే స్థితిని కోరుకోవాలన్నారు. కార్యక్రమంలో గడిపె అనిల్‌కుమార్, రమేష్, గడిపె భిక్షపతి, ఎర్ర భాస్కర్, రాములు, రవి, యాదగిరి, రాజమల్లు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యం

గజ్వేల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలను అందించడమే కేంద్రంలోని మోదీ ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 12వ వార్డులో బీజేపీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వార్డు ప్రజలకు ఇంటింటికీ గొడుగుల పంపిణీ ప్రారంభించామన్నారు. వారితో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్‌రెడ్డి, బీజేపీ గజ్వేల్ నాయకులు పంజాల రాజుగౌడ్, గజ్వేల్ పట్టణ కోశాధికారి హరికుమార్, బీజేపీ సీనియర్ నాయకులు మంద వెంకట్, కాశమైన సందీప్, భైరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేటలోని గాయత్రి విద్యాలయంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్/కోహెడ/జగదేవ్‌పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలతో సందడిగా మారాయి. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, కోహెడ మండలం బస్వాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అదేవిధంగా సిద్దిపేట పట్టణంలోని గాయత్రి విద్యాలయం 1999- 2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సమావేశమై ఆత్మీయం సమావేశం జరుపుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న ఆయా పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. రోజంతా ఆడి పాడి ఉల్లాసంగా గడిపారు.




జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలలో, కోహెడ మండలం బస్వాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

నిర్వహణ లేమితో నిరాదరణ



నకాశీ పెయింటింగ్స్‌ను ఆసక్తిగా చూస్తున్న ప్రపంచ అందగత్తెలు (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

జిల్లా కేంద్రానికి చెందిన ఓ క్యాంటీన్ నిర్వాహకుడితో ఒప్పందం కుదుర్చుకుని అతడి సొంత ఖర్చులతోనే రేకుల షెడ్డు ఏర్పాటు చేయించారు. అయితే గెస్ట్‌హౌజ్‌కు రక్షణ కరువవడం, విద్యుత్‌చార్జీలు, ఇతరత్రా నిర్వహణ బిల్లుల చెల్లింపునకు సహాయపడక, స్థానిక కళాకారులు, శిక్షకులనే భరించాలని సూచించారు. కానీ ఆయా ఖర్చులు భారంగా మారడంతో తమకెందుకొచ్చిన గొడవని పట్టణం లోపల తక్కువ అద్దెకు లభించిన ఇంట్లో శిక్షణ అందిస్తున్నారు. గెస్ట్‌హౌజ్‌లో ఉన్న రెండు గదుల్లో ఓ గది ప్రైవేటు ఆర్టిస్ట్‌కు అప్పగించారు. మరోగదిలో సామాగ్రి భద్ర పరిచారు. పర్యాటకశాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల వర్క్‌షాప్ వద్దకు ఎవరూ రాకపోవడంతో పాడుబడిపోతూ ఆవరణ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయింది. ఆవరణ ఫ్లోరింగ్ దెబ్బతింది. గెస్ట్‌హౌజ్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక క్యాంటీన్ నిర్వాహకుడు కూడా తాను సమకూర్చుకున్న రేకులషెడ్‌ను ఇటీవల తొలగించి సామాగ్రిని తీసుకెళ్లాడు. నాడు కళకళలాడిన వర్క్‌షాప్ ప్రాంగణం నేడు వెలవెలబోతుండడంతో పాటు చేర్యాల వన్నెకు మాయని మచ్చలా ఉన్న పర్యాటకశాఖాధికారుల పనితీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కలెక్టర్‌తో పాటు పర్యాటకశాఖ ఉన్నతాధికారులు చొరవ వహించి వర్క్‌షాప్ గెస్ట్‌హౌజ్‌కు పూర్వవైభవం సంతరింపచేయాలని స్థానికులు కోరు తున్నారు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ సందర్భంగా మోదీకి బహూకరిస్తున్న నకాశీ పెయింటింగ్(ఫైల్)

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఇందిరమ్మ ఇళ్ల పనుల పేరిట దందా
- ట్రాక్టర్ ట్రిప్పుకు రూ, 4,500 నుంచి రూ, 5 వేల వరకు వసూలు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు



వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో పోస్తున్న కూలీలు

అక్కన్నపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కన్నపేట, జనగామ, గౌరవెల్లి వాగుల్లో నుంచి ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు-ఆరు కాయలుగా కొనసాగుతోంది. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనుల పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం.

ఇసుకాసురుల సిండికేట్..!

ఇసుక ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో ట్రిప్ ఇసుకకు రూ.4,500 వేల నుంచి రూ.5 వేల చొప్పున తీసుకుంటున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు అయితే ఏకంగా వాగుల్లో జేసీబీలు పెట్టి రాత్రికి రాత్రే ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలు, యువకులు ఇదేమిటని ప్రశ్నిస్తే ఇందిరమ్మ ఇళ్ల పనులను అడ్డుకుంటున్నారని, పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ వాగులను కొల్లగొడుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, యువజన సంఘాల సభ్యులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు.

అధికారులతో కుమ్మక్కు..

నాలుగు రోజుల క్రితం అక్కన్నపేటలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామానికి చెందిన కందుకూరి అరుణాచారి పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ట్రాక్టర్లను తీసుకవచ్చి ఇసుకను పోలీస్‌స్టేషన్‌లో డంపు చేయించి వదిలిపెట్టారని తెలిపారు. ఇలా ఎవరైనా అధికారులు పట్టుకుంటే అభివృద్ధి పనుల కోసం తరలిస్తున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో కింది స్థాయి సిబ్బంది సహకరించడంతో వారిని అడిగే వారు కూడా కరువయ్యారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులే దందా చేస్తున్న వారి నుంచి మామూళ్లు తీసుకుంటూ వారికి సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ తనిఖీలు చేసినా ముందస్తుగానే సమాచారం అందించి ట్రాక్టర్లు వెళ్లిపోయిన తర్వాత వస్తున్నారని పలువురు చెబుతున్నారు.

తగ్గుతున్న భూగర్భజలాలు

ఇసుక అక్రమ తవ్వకాల వల్ల స్థానికంగా భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. దీంతో వ్యవసాయ సాగుకు నీటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఇటీవల కొంత మంది యువకులు అక్రమ ఇసుక రవాణా దారులను అడ్డుకుని ప్రశ్నిస్తే ఏ అధికారులు కూడా తమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకోరని బహిరంగంగానే చెప్పడం పట్ల అధికారుల తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.